క్లుప్తంగా

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయిల్ పామ్ పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. బుధవారం మండలంలో తిగుల్ గ్రామంలో ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. ఆయిల్ పామ్ మొక్కలకు వయసును బట్టి తగిన మోతాదులో నీరు, పోషకాలు అందించాలని సూచించారు. నాటిన ఏడాది తర్వాత వచ్చే గెలలను తొలగించాలన్నారు. నాటిన 36 నెలల తర్వాత వచ్చే గెలలను వదిలి నలుపు రంగు నుంచి నారింజ రంగులోకి మారినప్పుడు గెలలను కోయాలని సూచించారు. మండలంలోని 560 ఎకరాల్లో పంటను సాగుచేసినట్లు తెలిపారు. ఆయిల్ పామ్ ఫెడ్ ఫీల్డ్ అధికారి విజయ్, ఏఈఓలు శరణ్య, భాను, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

'వాల్టా'ను అతిక్రమిస్తే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోవర్ధన్ హెచ్చరించారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కూడవెల్లి వాగు, నాగయ్య వాగు పరిసర ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాల్ నర్సయ్య

సిద్దిపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులతో పెయింటర్ ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఘటన మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి బాల్ నరసయ్య(35) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. కొన్నిరోజులుగా మూర్ఛవ్యాధితో బాధపడుతూ పనికి వెళ్లకపోవడంతో చిట్టీలు కట్టలేకపోయాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచనల మేరకు హైదరాబాదు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

14న వేలం పాటలు

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 14వ తేదీన బెజ్జంకి మండల కేంద్రంలో కూరగాయలు, పశువుల విక్రయాల వార సంతకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తిగల వారు పశువుల అంగడి కోసం రూ.20 వేలు, కూరగాయల సంత కోసం రూ.12 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాటలో సంతలను సొంతం చేసుకున్న గుత్తేదార్లు 2025 మార్చి వరకు విక్రయాలు చేపట్టవచ్చన్నారు. బెజ్జంకి పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాటలు ఎంపీడీఓ సమక్షంలో జరుగుతాయన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపించడం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని, తమ పిల్లల్ని ప్రైవేటుకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా చూడాలన్నారు.

ముగిసిన ఈసెట్ కౌన్సెలింగ్

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్ బుధవారం ముగిసింది. చివరి రోజు 82 మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి లాగిన్‌ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న విద్యార్థులకు 18వ తేదీన కళాశాల అలాట్‌మెంట్ జరుగుతుందన్నారు.

ఇసుక వేలం

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల మండల పరిధిలోని కమలాయపల్లిలో రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం వేలం వేశారు. వేలం పాటలో ఐదుగురు పాల్గొనగా గ్రామానికి చెందిన గుత్తి వెంకటయ్య రూ.56 వేలకు దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డి శివారులో వల్లకొండ సంజీవ రెడ్డి స్థలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, మిరుదొడ్డి పోలీసులు బుధవారం తెలిపారు. ఎవరైనా ఇసుక, పీడీఎస్ రైస్, మొరం, మట్టి అక్రమ రవాణా చేసినా, పేకాట, జూదం, గంజాయి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా 87126 67445, 871126 67447, 87126 67446 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



నంగునూరులో యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం అందజేశారు. అనంతరం రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు.

అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆదర్శం

మర్కూక్(గజ్వేల్): అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆదర్శమని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అంగడి కిష్టాపూర్ పాఠశాల జాతీయ స్థాయిలోనే పురస్కారానికి నామినేట్ కావడం అభినందనీయమన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, మాసాన్‌పల్లి మదిర ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందాపూర్ పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం జెడ్పీటీసీ షభ్యుడు గిరికొండరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను, వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వర్గల్(గజ్వేల్): ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజల వరకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని, ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని వర్గల్ ఎంపీపీ లత పేర్కొన్నారు. సర్కారు బడిలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమం సందర్భంగా వర్గల్ జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, నోటుబుక్కులు పంపిణీ చేశారు.



పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న డీఆర్డీఓ జయదేవ్ ఆర్య



దుబ్బాకలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత

పాఠ్యపుస్తకాల పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, అంతక్కపేట, కట్కూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి రంగనాయక్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నారన్నారు.

దుబ్బాక కస్తూర్బా గాంధీ పాఠశాలలో..

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యనందిస్తున్నారని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. బుధవారం దుబ్బాక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల దిశ దశ మార్చిన ఘనత కేవలం మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

అసంపూర్తి నిర్మాణం పూర్తి చేయండి

హుస్నాబాద్: నిధులు లేక నిలిచిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కళాశాల విద్యార్థినులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించగా, భవన నిర్మాణ పనులు స్లాబ్ వరకు పూర్తి చేశారన్నారు. సదరు కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల చెక్కునివ్వగా, బ్యాంక్‌కు వెళితే డబ్బులు జమ కాకపోవడంతో పనులు నిలిపి వేశారన్నారు. గ్రంథాలయం బిల్డింగ్‌కు తలుపులు, కిటికీలు, లైబ్రరీ చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు లైబ్రరీ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. మంత్రి సత్వరమే నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాలని రవీందర్ గౌడ్ కోరాడు.



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు



మిరుదొడ్డిలో మూతబడ్డ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

మూడేళ్లుగా మూత 'బడి'



బడికి వేసిన తాళం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. విద్యార్థులు మాత్రం లేరు. మూడేళ్లుగా ఈ పాఠశాలలో అడ్మిషన్లు లేకపోవడంతో ఇక్కడ పని చేసిన టీచర్లను డిప్యూటేషన్లపై పంపించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు లేక మరోసారి మూతబడింది. ఈ పాఠశాలను జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ పునఃప్రారంభోత్సవానికి నోచుకోలేదు.

విద్యతోనే సమాజ పురోభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



చిన్నకోడూరులో సన్మానించిన విద్యార్థులతో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజాచైతన్యం విద్యతోనే సాధ్యమని, అదే సమాజ పురోగతికి మార్గమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన పది మంది విద్యార్థులను సన్మానించారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. చదువుతోనే సంపూర్ణ జ్ఞానం లభిస్తుందన్నారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందన్నారు. విద్య వికాసాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కనకరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యనందించడమే లక్ష్యం

ఎంఈఓ జోగు ప్రభుదాసు



మిరుదొడ్డిలో పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈఓ ప్రభుదాసు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడమే లక్ష్యమని ఎంఈఓ జోగు ప్రభుదాసు అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీడీఓ గంగుల గణేష్‌రెడ్డి, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శ రాములుతో కలిసి బుధవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు, స్కూల్ యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు చక్కటి విద్యాబోధన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకట రామలింగం, గ్రామ పంచాయతీ సెక్రటరీ ఫహీం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ జరీనా, హెచ్‌ఎం రమేష్, టీచర్లు ఇరుకుల్ల శ్రీనివాస్, వెంకట్ నర్సింహులు జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాల రూపురేఖలు మారాయి

ఎంపీపీ బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారి ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ సంతోష్, ఎంపీటీసీ సభ్యులు గ్రామాలవారీగా ఎదురొంటున్న సమస్యలను గురించి అధికారులకు తెలియజేశారు. అనంతరం ఎంపీపీ బాలకృష్ణ మాట్లాడుతూ చిన్నమండలం అయినప్పటికీ ప్రజలు, అధికారుల సమన్వయంతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయన్నారు. కొన్ని గ్రామాలు జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో గుర్తింపుపొందినట్లు తెలిపారు.

నిధుల దుర్వినియోగం సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పట్టణంలోని హనుమాన్ నగర్ ఎంపీపీఎస్ హెచ్‌ఎం పాఠశాలకు వస్తున్న నిధులను సొంతానికి వాడుకున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కప్పతల్లి ఆడిన చిన్నారులు

బెజ్జంకి(సిద్దిపేట): వర్షాలు కురవాలని మండలంలోని రేగులపల్లెలో బుధవారం చిన్నారులు కప్పతల్లి ఆడారు. రోకలికి కప్పను కట్టి గ్రామంలో కలియ దిరిగారు. గ్రామస్తులు నీల్లు పోసి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

ఐదేళ్లుగా సఖీ కేంద్రం సేవలు



కేక్ కట్‌చేస్తున్న సఖీ సెంటర్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: సిద్దిపేట సఖీ కేంద్రం ఏర్పాటై ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిబ్బంది బుధవారం వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఐదేళ్లుగా సఖీ కేంద్రానికి ఎన్నో రకాల సమస్యలతో వస్తున్న మహిళలకు అండగా నిలవడం జరిగిందన్నారు. కేంద్రం ఐదేళ్లుగా విజయవంతంగా సేవలు అందిస్తూ ఆరో సంవత్సరంలోకి అడుగు పెట్టడం సంతోషకరంగా ఉందన్నారు. కేంద్రానికి సమస్యలతో వచ్చే మహిళలకు సత్వర న్యాయం కలిగే దిశగా ప్రతీ ఒక్కరూ ప్రయత్నించాలని సిబ్బందికి సూచించారు. బాధిత మహిళలకు సఖీ కేంద్రం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్వరూపరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట



కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జ్యూస్ ఇచ్చి స్వాగతం పలుకుతున్న టీచర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. బడిగంట మోగడంతో బడీడు పిల్లలందరూ బడిబాట పట్టారు. ఆయా పాఠశాల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం అందజేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థులకు వినూత్న రీతిలో జ్యూస్ ఇచ్చి స్వాగతం పలికారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. బుధవారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని మర్రిముచ్చాల ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూం ప్రారంభించారు. అనంతరం కొమురవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా రూపొందిస్తుందని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అమ్మ కమిటీల చైర్మన్‌లు, ఉపాధాయ్యులు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు తక్కువగా..

జగదేవ్‌పూర్(జగదేవ్‌పూర్): వేసవి సెలవులు ముగియడంతో మండలంలో పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. తొలి రోజు కావడంతో పిల్లలు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. నాలుగేళ్లుగా మూతబడిన నిర్మల్‌నగర్ పాఠశాల పునః ప్రారంభించారు. విద్యార్థులకు జగదేవ్‌పూర్‌లో బాలికల పాఠశాలలో ఎంపీపీ బాలేషంగౌడ్ నోట్ పుస్తకాలు, బుక్స్, యూనిఫామ్ అందజేశారు. తిమ్మాపూర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతుల మధ్యనే పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు.

బడిబాట పట్టిన విద్యార్థులు

హుస్నాబాద్: సెలవుల్లో ఎంజాయ్ చేసిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమయ్యారు. బుధవారం పాఠశాలల పునఃప్రారంభ తొలిరోజు విద్యార్థులు సంతోషంగా పాఠశాలకు వచ్చారు. మొదటి రోజు నామమాత్రంగానే హాజరయ్యారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పండగ వాతావరణం తలపించేలా పాఠశాల మెయిన్ గేట్‌కు ఇరువైపులా కొబ్బరి మట్టలు, మామిడి ఆకుల తోరణాలు, బెలున్లూ కట్టి అందంగా అలంకరించి విద్యార్థులను పాఠశాలలోకి ఆహ్వానించారు. విద్యార్థుల్లో ఉత్తేజం నింపెలా ఉపాధ్యాయులు చప్పట్లు కొడుతూ బ్యాండ్‌మేళంతో వెల్‌కమ్ చెప్పారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అతి తక్కువగా వచ్చారు.



మర్రిముచ్చాల ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూంను ప్రారంభిస్తున్న ఎంపీపీ తలారి కీర్తన



హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలలు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొత్తం 4,106 మంది విద్యార్థులకుగాను 1,436 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని లాల్‌కమాన్, మార్కెట్ యార్డులోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా ఉండదని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పటేల్‌పుర, అంబేద్కర్‌నగర్, సంజీవయ్యనగర్, వేములవాడ కమాన్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, సాజీద్‌పుర, వీవీనగర్, పారుపల్లి, దోబిగల్లి, లాల్‌కమాన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

◆ మెట్టు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు..

తొగుట(దుబ్బాక): మండలంలోని మెట్టు సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ మరమ్మతులు చేయనున్నట్టు తుక్కాపూర్ ఏడీఈ శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. ఈ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మెట్టు, తడ్కపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలోని బండారుపల్లి, పెద్దమాసాన్‌పల్లి, గుడికందుల, గణపురం, లింగంపేట గ్రామాల పరిధిలోని వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

◆ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణకు పట్టణ ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్, పేపర్ ప్లేట్ల వినియోగం తగ్గించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు నిర్వహిస్తున్న 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బుధవారం జీరోవేస్ట్ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్లేట్లకు బదులు స్టీల్ ప్లేట్లు లేదా ఆకులతో తయారు చేసిన ప్లేట్లను వాడాలన్నారు. ఆకు ప్లేట్ల వినియోగంతో చెత్త రాదని, వీటితో ఎరువు తయారు చేసుకోవచ్చన్నారు.

◆ దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని దివ్యాంగులకు సిద్దిపేట ఆర్టీసీ డిపో అధికారులు బస్సుపాస్ రెన్యూవల్ ఉచితంగా చేస్తున్నట్లు పాస్‌ల ఇన్‌చార్జ్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. బస్సుపాసు కావాల్సిన వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో చిన్నకోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాలని సూచించారు.

◆ చెక్కు అందజేత

సిద్దిపేటకమాన్: కొన్ని రోజుల క్రితం మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కుటుంబానికి డిపార్ట్‌మెంట్ తరఫున విడుదల చేసిన రూ.8 లక్షల బెనిఫిట్స్ చెక్కును పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసులకు డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందన్నారు. తిరుపతి కుటుంబానికి రావాల్సిన మరికొన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ నిధులు విడుదలకు వినతి

వర్గల్(గజ్వేల్): గ్రామ పంచాయతీల్లో నిధులు లేక విధుల నిర్వహణ భారంగా మారిందని వర్గల్ మండల పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఖలీంలకు వినతిపత్రం అందజేశారు.

◆ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

సిద్దిపేటకమాన్: విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడేళ్లగా సుమారు రూ.7 వేల కోట్ల బకాయి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి

సిద్దిపేటకమాన్: నేషనల్ ఎలిజిబులిటీ ఎంట్రెన్స్ (నీట్) పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం 2024లో నిర్వహించిన నీట్ నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని, విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు.

◆ బెల్టు షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాలలో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పోలీసు అధికారులు హెచ్చరించారు. గ్రామంలో బెల్టు షాపుల నిర్వహణతో ఇబ్బందులు పడుతున్నామంటూ పలువురు మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లిన ఎక్సైజ్ ఎస్ఐ సురేష్, పోలీస్ ఎస్ఐ దామోదర్ మహిళలతో మాట్లాడారు. గురువారం నుంచి గ్రామంలో బెల్టు షాపులు ఉండవని, ఎవరైనా నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.